# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 29 డిసెంబర్ 2023


## ఎన్నికలకు సన్నద్ధం కావాలి

### సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్




**కడప క్రైం, డిసెంబరు 28, ప్రభాతవార్త**

రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ఘటనలకు వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు, చెడు నడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న రౌడీషీటర్లకు సాక్షాధారాలతో శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. న్యాస్థానాల్లో తగిన సాక్షాధారాలతో రౌడీషీటర్లకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటే తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)తుషార్ డూడి, ప్రొద్దుటూరు ఏఎస్పీ పేర్ణకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ తేక్వాండో పోటీల్లో రాజంపేట విద్యార్థుల ప్రతిభ



**రాజంపేట అర్బన్, డిసెంబరు 28 ప్రభాతవార్త**

కలకత్తాలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ తేక్వాండో పోటీల్లో రాజంపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారని మాస్టర్‌లు రెడ్డి ప్రవీణ్, ఉద్దండపు బాలాజీగణేష్‌లు తెలిపారు. స్థానిక ఏకలవ్య మార్షల్‌ఆర్ట్స్ అకాడమికి చెందిన క్రీడాకారులు ప్రవల్లిక, సహస్వి, కావ్య, హితేషిలు రజత పతకాలు, మనోజ్, వైష్ణవ్‌రెడ్డి, కృతికారెడ్డి, తరుణ్‌లు కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. విద్యతో పాటు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మాస్టర్ పేర్కొన్నారు.

## సామాజిక సాధికారిత జగన్ ప్రభుత్వం విధానం

### ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, ఎమ్మెల్సీ జకియాఖానం, ఎంఎల్ఏ శ్రీకాంత్‌రెడ్డి





**రాయచోటి,డిసెంబర్28, ప్రభాత వార్త :**

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా, విద్య, రాజకీయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి చేశారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమానికి పలు వురు నాయకులతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కళ్యాన పండపంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం, ఎంపీ నందిగం సురేష్, వివిధ వర్గాల నాయకులతో కలసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 2.5 లక్షల కోట్లు రూపాయలు నిధులను నేరుగా అబ్దిదారులకే జమ చేయడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో సీయం జగన్ మోహన్ రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సాధికార బస్సు యాత్ర



కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందన్నారు. యాత్రలు విజయవంతం అవుతుండడంతో ప్రతి పక్షాలకు భయం పుట్టుకుందన్నారు. చంద్రబాబు నాయి బ్రాహ్మణుల తోక కత్తిరిస్తాననడం, ఎస్టీలలో ఎవరు పుట్టాలనుకుంటారని, బిసిలు ఉన్నత పదవులకు పనికిరారని చెప్పడం దుర్మార్గమన్నారు. హోమ్ మంత్రి, విద్యాశాఖ మంత్రులుగా ఎస్సీలు, ఉపముఖ్యమంత్రి, శాసన మండలి చైర్మెన్‌గా మైనార్టీలకు ఇచ్చి సియం జగన్ చరిత్రను సృష్టించారన్నారు.

### మైనార్టీల పక్షపాతి సీయం జగన్ : జకియా ఖానం

ముఖ్యమంత్రి వైయస్‌జగన్ మహిళలకు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని జాకియా ఖానం అన్నారు. సాధారణ మహిళనైన తనకు శాసన మండలి సభ్యురాలుగా చేయడంతో పాటు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వడం మామూలు విషయం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం జరిగేలా చేసిన ఎకైక నాయకుడు జగనమోహన్ రెడ్డిలని తెలిపారు.

### బడుగు బలహీన వర్గాల్లో వెలుగులు నింపారు : ఎంపీ నందిగం సురేష్

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కుల మత బేదాలు లేకుండా పారదర్శక పాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని నందిగామ ఎంపీ సెరేష్ తెలిపారు. చేనేత, వాహన విత్రులు వివిధ వర్గాల వారికి సంక్షేమ పథకాలతో అదుకుంటున్నారన్నారు. విద్య, వైద్యం కోసం వేల కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారన్నారు.2024లో జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యేగా శ్రీకాంత్ రెడ్డి,ఎంపీగా మిధున్ రెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించుకొని మళ్ళీ జగనన్నను సీయంగా చేసుకోవా లన్నారు. బిసి లంటే బ్యాక్ వర్డ్ కాదని బ్యాక్ బోన్‌లని జగనన్న నిరూపించా దని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. సామాజిక సాధికారిక బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలు బ్రహ్మరదం పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మెన్ వండాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరంలో లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందజేయడంపై దృష్టి సారించండి





**కడప డిసెంబర్ 28, ప్రభాతవార్త**

కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. 2024 జనవరి నెలలో అమలు చేయనున్న నాలుగు ప్రధాన కార్యక్రమాల నిర్వహణ, తీసుకోవలసిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు, మైదుకూరు, రాజంపేట ఎమ్మెల్యేలు రఘురామి రెడ్డి, మేడా మల్లికా ర్జున రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహాదారు రాజోలు వీరారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. సీఎం వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం వచ్చే ఏడాది జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది పంపిణీ కార్యక్రమం.. గ్రామ సచివాలయాల నుండి జిల్లా స్థాయి వరకు.. పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగా లన్నారు. ఒకటవ అంశంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అవ్వా తాతలు, వితంతువులతో పాటు.. చేనేత కార్మి కులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, పాదరక్షలు కుట్టేవారు, ఒంటరి మహిళలు, హెచ్‌ఐవీ బాధితులకు వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి పెంచిన కొత్త వైఎస్సార్ పెన్షన్ కానుక ను అందజేయనున్నారన్నారు. పెంచిన కొత్త పెన్షన్ లబ్దిని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచుతూ.. ఈ డిసెంబర్ మాసం నుంచే అమలు చేస్తోందన్నారు. రెండవ అంశంగా జనవరి 19న రాష్ట్రం లో ఈ ఐదేళ్ల పాలనలో చేపట్టిన సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా విజయవాడలో నిర్మించిన 125 అడుగుల ఎత్తైన డా. బి.ఆర్. అంబేద్కర్ భారీ విగ్రహాన్ని జనవరి 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవిష్కరించనున్నారన్నారు. అదే విగ్రహం ఫోటో ఫ్రేమ్ లను అదేరోజున అన్ని గ్రామ సచివాలయంలో.. ప్రతిష్టించి ఉత్సవాలు జరపలన్నారు. అలాగే మూడో అంశంగా జనవరి 23న చివరి దఫా వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కార్యక్రమంపై రెండు విడతలుగా చేపట్టే ప్రచారం, నాల్గవ అంశంగా ఫిబ్రవరి 5 నుంచి 14వ తేది వరకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సహాయం పంపిణీ చేసే కార్యక్రమాలు, వాలంటీర్లచే సంక్షేమ పథకాలపై లబ్ధిదారులచే రూపొందించిన బెస్ట్ టెస్టిమొనీ వీడియోలను అప్లోడ్ చేయించడం, జనవరి ఒకటి నుంచి రెండో ఫేజ్ "జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం" నిర్వహణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించిన అంశాలను జిల్లా కలెక్టర్ అధికారులకు తెలియజేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్డీఏ, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ పెన్షన్ కానుక పండుగ వాతావరణంలో నిర్వహించాలి : కలెక్టర్ గిరిషా



**రాయచోటి,డిసెంబర్28, ప్రభాత వార్త :**

వైయస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీష పియస్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లె లోని సియం క్యాంపు కార్యాలయం నుండి వైయస్ఆర్ పెన్షన్ కానుక, వైయస్ఆర్ చేయుత, వైయసార్ ఆసరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర పథకాల అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్పరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని విసి హాలు నంచి జిల్లా కలెక్టర్ గిరీష పియస్ రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ డిఆర్‌డిఏ పిడి సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్పరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పియస్ మాట్లాడూతూ జిల్లాలో వైయస్ఆర్ పెన్షన్ కానుక, వైయస్ఆర్ చేయుత, వైయసార్ ఆసరా, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైయస్ఆర్ పెన్షన్ కానుక, వైయస్ఆర్ చేయుత, వైయసార్ ఆసరా ఒక షెడ్యూల్ రూపొందించుకొని ముందుకు వెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకాలను ఆయా నియోజక వర్గాలలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని షెడ్యూల్ ప్రకారం వెళ్లాలన్నారు. జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని ఒక ఉత్సవం లాగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జనవరి ఒకటో తేదీ నుండి 8వ తేదీ వరకు వైయస్ఆర్ పెన్షన్ కానుక కింద కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జనవరి 23వ తేదీన వైయస్ఆర్ అసరా కార్యక్రమము , ఫిబ్రవరి 5వ తేదీన వైయస్ఆర్ చేయుత పథకం ప్రారంభించడం జరుగుతుందని, చేయుత క్రింద 5 నుండి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పథకాలకు సంబంధించి గ్రామ స్థాయి వరకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులందరూ సీరియస్‌గా తీసుకొని ముందుస్తు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకొని విజయవంతం చేయాలన్నారు.

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

### మా అనుభవంలో ఉందని అడ్డుతగిలిన మహిళలు పోలీసుల సమక్షంలో భూమిని చదునుచేసిన వైనం స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారలు



**బద్వేలు, డిసెంబర్ 28 ప్రభాతవార్త**

మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామ పంచాయతీ సర్వేనెంబరు 1810/3లో యాభై సెంట్ల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసు కున్నారు. మా అనుభవంలో ఉందని పక్కనే ఉన్న భూ యజమానులు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. కొన్ని సంవత్సరాలుగా భూమిని చదును చేస్తూ మా అనుభవంలో ఉన్నప్పటికీ ఎవరూ రాలేదని ఈరోజు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని అడ్డు తగలడం ఎంతవరకు సమంజసమన్నారు. కొన్ని సంవత్సరాలుగా రికార్డులో కనపడని భూమి ఈ రోజు ఎలా కనపడిందని, ప్రభుత్వ భూమి అయితే ఇన్ని రోజులు అధికారులు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. రెవెన్యూరికార్డుల ప్రకారం 1810/3లో అర్థ ఎకరా భూమి ప్రభుత్వానిదని దానిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతుండగా పక్క భూముల వారు అడ్డు తగులుతున్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. పోలీసుల సహకారంతో ప్రభుత్వ భూమిని చదును చేయడం జరిగిందని ప్రభుత్వం నుంచి ఎవరు ఆక్రమించిన కఠిన చర్యలు తప్పవన్నారు. మొదటగా బూమిని చదును చేస్తుండగా మహిళలు అడ్డుకుని జేసీబీకి అడ్డు తగిలారు. పోలీసులు వారిని పక్కకు నెట్టి వేసి భూమిలో ఉన్న గడ్డిని అంతా చదును చేశారు. అనంతరం ప్రబుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అర్థ ఎకరా ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాల కోసం ఉపయోగించేందుకు సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.

## యథేచ్ఛగా అక్రమ లేఅవుట్

### భారీగా ప్రభుత్వ ఖజానాకు గండి

**సిద్ధవటం,డిసెంబర్ 28,ప్రభాతవార్త:**


మండల పరిధిలోని పెద్దపల్లి రెవెన్యూ పొలం బోగిడివారిపల్లె గ్రామ పంచాయితీ వాసవి కాలేజ్ వెనుక ప్రాంతంలో సుమారు నాలుగున్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి నందు పెద్దపల్లి గ్రామం సర్వే నెంబర్ 86-1బి,86-1సి నందు ఎటువంటి గ్రామపంచాయితీ అప్రూవల్,మండల రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా కోట్ల విలువచేసే భూమిలో అక్రమ లేఅవుట్లు వేయడం భారీగా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నది ఎవరైనా వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయాలి అంటే వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయాలి అంటే వ్యవసాయేతర భూమిగా మార్చుకొని పనులు మొదలు పెట్టాలి అధికార పార్టీ అండదండలతో పుష్కలంగా ఉండడంతో వడ్డించే వాళ్ళు మన వాళ్ళు ఉండగా మనకు చింత ఎలా అన్నట్టుంది వ్యవహారం పెద్దపల్లి రెవెన్యూ అంటే భూకబ్జాలకు పుట్టినిల్లుగా మారిపోయింది వ్యవసాయ భూమిని ప్లాట్లుగా వేసి హద్దురాలను



ఏర్పాటు చేసి రహదారిని వేయుటకు ఇసుక కంకర తోలుకొని పనులను కొద్ది రోజులగా జరుగుతున్న అనుమతి లేని లేఅవుట్ పనులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితిలు తలేత్తాయి ఆ నోట ఈ నోట పొక్కడంతో గురువారం ఆ ప్రాంతానికి మండల తాహిశీల్దార్ లక్ష్మీదేవి ఆదేశాలతో గ్రామ రెవెన్యూ అధికారి రేణుక ఎట్టకేలకు పనులు నిలుపుదల చేశారు కూలీ పనులు చేస్తున్న కొంతమంది ఆ ప్రాంతం నుండి బయటకు వెళ్లిపోమని గ్రామ రెవెన్యూ అధికారి ఆదేశించారు.

## మన ఆలోచనలే... మన ఆవిష్కరణలు

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి





**కడప డిసెంబర్ 28, ప్రభాతవార్త**

మన ఆలోచనలే.. మన ఆవిష్కరణలు" అని ఆటవిక జీవనం నుండి పరిణమించిన మానవిక వికాసమే " విజ్ఞానం" అని ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ భాష, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి లు సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం స్థానిక మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల నందు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ భాష, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి,ఎస్ సిఇఆర్‌టి ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులు గా హాజరై రిబ్బన్ కత్తిరించి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజాద్ భాష మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ను కడప నగరంలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషమని అన్నారు. ఈరోజు విద్యార్థిని విద్యార్థులకు ఒక పండగ రోజు అని విద్యార్థి దశలో తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడం అంటే పాఠశాలల్లోగాని ఆ నగరంలో ఒక పండగ వాతావరణం ఉండేదని అన్నారు. అలాంటిది ఈ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన కడప నగరంలో నిర్వహించడం సంతోష కరమైన విషయమని అన్నారు. సివి రామన్, ఏపీజే అబ్దుల్ కలాం వారిని ఆదర్శంగా తీసుకొని మన మందరం ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు అందరూ రాబోవు రోజుల్లో అసలు వ్యక్తులుగా ఎదగాలని అన్నారు. ఆ దిశలోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందని, ముఖ్య మంత్రి ఉద్దేశం కూడా ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదవాలని, చదువుకు పేదరికం అడ్డుకాకూడదని అన్ని ప్రభుత్వ పాఠశాలలను రివెండ్ చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ సందర్భంగా విద్యా ర్థులు సృజనాత్మక ఆలోచన విధానాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతిభ పాటవాలను వెలికి తీయడానికి ఈ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లా డుతూ ఈ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కడప నగరంలో నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, విద్యార్థులు తమ విద్యలో సాధన చేస్తూ సృజనాత్మక ఆలోచన విధానం పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో సృజనాత్మక ఆలోచనలు ఉండాలని విద్యార్థులు నాణ్యత కలిగిన నైతిక విలువలు కలిగిన ఏమైనా విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం అంజద్ భాష, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి, ఎస్ సిఇఆర్‌టి ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన గదులను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించడం జరిగింది. ప్రదర్శనలో ఉంచిన ప్రదర్శనలపై విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, రాష్ట్ర ఉద్యాన శాఖ రహదారులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ నారాయణ, ఇతర అధికారులు, కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి అహమ్మద్, ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు, 26 జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పాఠశాలలను సంసిద్ధం చేయండి..!

### - స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కమిషనర్ భాస్కర్ కట్టమనేని ఉత్తర్వులు జారీ

**అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త**

రాష్ట్రంలో 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని రంగాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల రెండు రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ముఖ్యమైన అధికార యంత్రాంగంతో ఎన్నికల కమీషన్ నియమించిన ప్రత్యేక బృందం ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సమీక్షా సమావేశాలు నిర్వహించి పలు రకాల సూచనలు, ఆదేశాలు జారీ చేసి వెళ్ళిన విషయం తెలిసిందే. తాజాగా ఎన్నికల నిర్వహణకు పాఠశాలలన్నింటిని సంసిద్ధం చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కమిషనర్ భాస్కర్ కట్టమనేని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు, అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్స్ కు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమీషనర్ ఆదేశాల మేరకు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ నిర్వహణకు అవసరమైన కనీస వసతులతో పాటు సౌకర్యాలు అన్ని పాఠశాలల్లో కల్పించాలని కూడా ఉత్తర్వుల్లో కోరారు. పోలింగ్ నిర్వహించే అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతితో పాటు వంట గదులతో పాటు ఎలక్ట్రికల్ ట్యూబ్ లైట్స్ వసతులు కూడా కల్పించాల్సి ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో సూచించారు. అలాగే ఫ్యాన్స్, స్విచ్‌లు ప్రతి పోలింగ్ కేంద్రంలో సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ నిర్వహించే పాఠశాలల గదుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని కూడా ఉత్తర్వుల్లో కోరారు. కాగా ఇదివరకే ఎన్నికల కమిషన్ ప్రత్యేక బృందం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, సిక్కిం, ఆరుణాచల్‌ప్రదేశ్‌లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై ఎన్నికల కమీషన్ అడుగులు ముందుకేసిన విషయం తెలిసిందే. అప్పుడు జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమీక్షా సమావేశంలో ఏప్రిల్ సార్వత్రిక ఎన్నికలుంటాయంటూ సంకేతాలు వెలువడించిన విషయం తెలిసిందే. యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని కలెక్టర్లకు, ఎస్పీలకు ఈ ప్రతినిధి బృందం ఆదేశాలు జారీ చేయడం, చెక్‌పోస్టులు ఏర్పాటు, తనిఖీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి కూడా బృందం ఆరా తీసిన విషయం తెలిసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలకు సంబం ధించి, అలర్లపై అప్రమత్తంగా ఉండాలని. అనేక నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు భారీగా నమోదైనట్టు ప్రధాన పక్షాలైన తెలుగుదేశం, వైసిపిలు చేసిన ఫిర్యా దుల అంశం కూడా ఈ సమీక్షా సమావేశంలో ప్రత్యేకంగా చర్చకు తావిచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శ కాలపై దృష్టి పెట్టి మరీ అధికారులతో సమీక్ష జరిపిన ఎన్నికల కమిషన్ ప్రత్యేక బృందం అధికారుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించి కూడా పలు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మూడేళ్లుగా ఒకే జిల్లాలో ఉన్న వారు ఎన్నికల విధుల్లో ఉండకూడదన్నది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల్లో కనిపిస్తోంది. ఇందుకు సంబంధించి 2024 జూన్ ఆఖరు వరకు మూడేళ్ల గడువుగా నిర్ణయించినట్టు అందిన ప్రాథమిక సమాచారం. ఎన్నికల కమిషన్ బృందం ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలను త్వరలోనే ఆయా రాష్ట్రాల సిఇసిలకు, సిఎస్‌లకు అందించనుంది.

## ఏపీయుయస్ కాలమాని ఆవిష్కరణ



రాయచోటి,డిసెంబర్28, ప్రభాత వార్త :

అన్నమయ్య జిల్లా రాయచోటిలోని జిల్లా విద్యాశాఖ అధికారి చేత ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం దైనందిన కాలమానిని ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ దైనందిన మరియు కాలమానిని చాలా బాగున్నాయని దేశభక్తి ప్రభోదాత్మకంగా ఉన్నాయని, దైనందినిలోని జీఓలు ఉపాధ్యాయులకు ఉపయోగ పడే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంమలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. నాగేశ్వర్ రావు, జిల్లా అధ్యక్షులు నరశింహులు, రాష్ట్ర కార్యదర్శి మదుమతి, జిల్లా కార్య దర్శులు టి శ్రీనివాసులు, బాలాజీ, రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ మద్యం ద్వంసం



రాయచోటి,డిసెంబర్28, ప్రభాత వార్త :

అన్నమయ్య జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ పరిదిలలొ పట్టుబడ్డ నాటు సారా 456 లీటర్లు, అక్రమ కేసుల్లో సీజ్ చేసిన 18 కేసుల్లోని పట్టుబడ్డ 2451 మద్యం బాటిల్స్‌ను ఎస్ఈబి అధికారులు పట్టన శివారు ల్లోనికి తరలించి డోజర్‌తో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబి ఇయస్ వి. శ్రీనివాసులు, రవి, సిబ్బంది పాల్గొన్నారు. వీటి విలువ రూ.3,56, 960లు అని వారు తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోతే ఉద్యమమే : ఈయూ

కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త:

ఆర్టీసీ ఉద్యోగులు 2020 నుంచి ప్రభుత్వంలో విలీనం అయినప్పటి నుంచి ప్రభుత్వం చెల్లించాల్సిన లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ చెల్లింపులతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విలీనం అనంతరం చనిపోయిన రిటైర్డ్ అయిన మెడికల్ న్ఫిట్ అయిన వీఆర్ఎస్ పెట్టుకున్న వారందరికీ ఈ సంవత్సరం సెప్టెంబరులోపే చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికి నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి ఉన్నారని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు తెలిపారు. గురువారం కడపలో నిర్వహించిన కడప జిల్లా నాన్ ఆపరేషన్ రీజియన్ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడారు. 2017 నుంచి 2020 వరకు చెల్లించాల్సిన మూడు సంవత్సరాల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా చెల్లించలేమని మేనేజ్‌మెంట్ చేతులెత్తేసింది. కనీసం 2017 పీఆర్‌సీకి సంబంధించిన అరియర్స్‌తో పాటు విలీనం సాకుగా చూపి అర్థం తరంగా నిలిపేసిన ఎస్ఆర్‌బీఎస్ ఎస్‌బీటీ ట్రస్టులలో పొదుపు చేసుకున్న సిబ్బంది బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, కడప జోనల్ అధ్యక్షులు కుమార్, జోనల్ కార్యదర్శి రాజ శేఖర్, కడప జిల్లా ఈయూ అధ్యక్షులు బోసుబాబు, జిల్లా కార్యదర్శి రామ్మూర్తి, కడప నాన్ ఆపరేషన్ రీజనల్ కార్యదర్శి అంకిరెడ్డితో పాటు జోన్, జిల్లా నాయకులు డిపో/ నాన్ ఆపరేషన్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయ్ ప్రీమియర్ లీగ్‌లో సలావుద్దీన్



కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త

క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడా కారు లకు ఉత్సాహపరుస్తూ ఎన్నో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్న తారీక్ అలీ అభినందనీయుడని ప్రముఖ సంఘ సేవకుడు సలా వుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఐపీఎల్ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్ పేరుతో కడప కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో విజయ్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్న టోర్నమెంట్ 2వ మ్యాచ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారం భించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ క్రికెటర్ విజ య్‌కుమార్ కడప క్రికెట్ అభివృద్ధిలో ఎంతగానో ఉపయోగపడ్డారని తెలి పారు. క్రీడాకారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంలో ఇప్పుడు ముందున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్కలైన్ వాటర్ మ్యానుఎఫ్యాక్చర్ అధినేత సందాని, గుడ్ మ్యానర్స్ ఎంటర్‌ప్రైసెస్ అధినేత పక్రుద్దీన్, సంఘ సేవకుడు మౌలాలీ, సయ్యద్ పాల్గొన్నారు.

## కబడ్దార్ వైసీపీ బలిజ సంఘ నేతలారా..



కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త

మాట అదుపు తప్పితే తీవ్ర పరిణామాలు తప్పవని కబడ్దార్ వైసీ పీ బలిజ సంఘ నేతలారా అంటూ బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు గోపి శెట్టి నాగరాజు, బలిజ సంఘం నేతలు గంధం ప్రసాద్, దండు సుబ్బరాయుడు, అరిగెల మహేష్, ఉపేంద్ర, కరుణా అన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం నగరం లోని హరితవర్స్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలిశెట్టి హరిప్రసాద్ అంటే ఏమిటో కడప జిల్లా ప్రజలందరికీ తెలుసు బలిజలకు ఎవరు ఎంత చేశారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. గత టీడీపీ హయాంలో బ్రహ్మయ్య, రత్న సభాపతి, రామచంద్రయ్యకు మంత్రి పదవులు ఇచ్చారు. పాలకొండరాయుడు, గునిపాటి రామయ్య, రామ చంద్రయ్య కు ఎంపీలు ఇచ్చిన ఘనత టీడీపీతే అన్నారు. వైసీపీలో లాగా అలం కార ప్రాయంగా పదవులు బలిజలకు ఇవ్వలేదన్నారు. ఓడిపోయే స్తానాలు బలిజలకు టీడీపీ ఇచ్చిందని కాపునాడు నేత నారాయణ స్వామి మాట్లాడడం హాస్యస్పద మన్నారు. ఆకుల వీధిలో కార్పొరేటర్ టికెట్ బలిజలకు ఇవ్వకుండా వేరే సామాజిక వర్గానికి ఇస్తే మాట్లాడలేని మీరా హరిప్రసాద్‌ను విమర్శించేదని ప్రశ్నించారు. మీ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

## నేషనల్ కౌన్సిల్ సమావేశానికి ఎన్‌జివో నేతలు




కడప కార్పొరేషన్, డిసెంబరు 28, ప్రభాతవార్త

28 నుంచి 30 వరకు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో జరు గుతున్న నేషనల్ కౌన్సిల్ సమా వేశానికి ఏపీ ఎన్జీవో కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, కోశాధికారి పి.నిత్య పూజయ్య పాల్గొన్నారు. బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం నుంచి 35 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కౌన్సిల్ సమా వేశంలో ప్రధాన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేస్తూ అన్ని రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ 138వ ఆవిర్భావ దినోత్సవం




కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త

కడప జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ 138వ ఆవిర్భావ దినోత్స వాన్ని పూర్తి చేసుకున్న శుభ సంద ర్భంగా కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. సుమంత్‌కుమార్ మాట్లాడుతూ అన్ని పార్టీలు వారి సొంత పార్టీల కోసం పోరాడుతుందన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించబోతోందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చక్రి, ప్రభు కుమార్, ఖుషీ, రాజా, రాజ్‌కుమార్, రవికుమార్, భరత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంతో విసిగిన జనం



కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త:

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలపై పెట్టిన భారంతో ప్రజలు విసిగి చెందారని ప్రభుత్వాన్ని ఎప్పు డు సాగనంపాలనే విధంగా ప్రజలు ఎన్నికల కొరకు సిద్ధంగా ఉన్నారని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని 22వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు కు గ్యారెం టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని రాష్ట్ర భవిష్యత్తు తెదేపాతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గౌస్ సలీం, మాలిక్, తెదేపా నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, జయరామి రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు నాసర్ అలీ, ఇమ్రాన్, నాగేంద్ర నాయుడు, రవి, శంకర్, యాదవ్, మురళీ మోహన్‌రెడ్డి, మామిళ్ల శివ, మాజజీ సర్పంచ్ వెంకటేష్, శిలా స్, రాజ్, సురేంద్ర, గౌస్, రాజు, వెంకటనాథ్‌రెడ్డి, గురయ్య, ఇలియాస్, శ్రీనివా సులు, శేష య్య, స్వర్ణలత, చిప్పగిరి మీనాక్షి, అరుణ, మాధవి, అమరావతి, మల్లేశ్వరి, దేవి, నిర్మల, డివిజన్‌లోని తెదేపా నాయకులు,పాల్గొన్నారు.

## సునీత కుటుంబాన్ని పరామర్శించిన లక్ష్మీ దేవమ్మ



తంబళ్లపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త

తంబళ్లపల్లె మండలం కోసు వారి పల్లి పంచాయతీ దేవర బురు జుకు చెందిన పెద్దకొండ్రెడ్డి గారి వేమా రెడ్డి భార్య సునీతారెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ ఈనెల 18వ తేదీ మృతి చెందారు. గురు వారం సునీతారెడ్డి ఉత్తరక్రియలు కార్యక్రమానికి తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ హాజరై సునీతారెడ్డి మృతికి సంతాపంతో పాటు కుమారులు మేఘ నాథ్‌రెడ్డి, సాయి చైతన్యరెడ్డి, కుమార్తె రాజశ్రీరెడ్డి వారి కుటుం బ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గతంలో సైతం ఆ కుటుంబానికి మాకు విడదీయరాని బంధం ఉందన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ నాగరత్న, రెడ్డప్ప, పలువురు నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో గెలిచిన వారికి జిల్లా స్థాయిలో అవకాశం

మైదుకూరు డిసెంబరు 28,ప్రభాత వార్త :

జాతీయ బాలికా దినోత్సవం సంధర్భంగా గురువారం మండలస్థాయిలో సేవ్ ది గర్ల్ చైల్డ్ అను ఆంశం పైన పోటీలు నిర్వహించడం జరిగింది,ఈ సంధర్భంగా మండల స్థాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విధ్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, సేవ్ ది గర్ల్స్ చైల్డ్ నందు ఎస్సే రైటింగ్,డిబేట్స్ పెయింటింగ్ ఆంశాలపైన పోటీలు నిర్వహించారు,ఈపోటీలు మైదుకూరు మండల విద్యాదికారి 2 నరసింహ్మశర్మ ఆధ్వర్యంలో జరిగింది,ఎస్సే రైటింగ్ నందు జడ్పిహెచ్ బాలికల పాఠశాలలో 10వ తరగతి విధ్యార్థిని కె.వి.ఎస్ ధనలక్ష్మికి మెదటి బహుమతి, వనిపెంట జడ్పిహెచ్ స్కూల్ 10వ తరగతి విధ్యార్థిని ఎం.అస్వితకు రెండవ బహుమతి. ఎపిటిఆర్ బాయ్స్ స్కూల్ ఎం.రామాంజనేయులు నాయక్‌కు 3వ బహుమతి,డిబేట్ నందు ఎన్.హిమ ప్రియకు 1వ బహుమతి,పి.అక్షయకు రెండవ బహుమతి,సి.కార్తీక్‌కు 3వ బహుమతి పెయింటింగ్‌లో టి.నాగేంధ్ర 1వ బహుమతి,సాత్వీక 2వ బహుమతి,ఎం పూజిత 3వ బహుమతి గెలు పోందారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో పాల్గోనేందుకు వెళ్ళవలసి ఉంటుంది. కార్యక్రమంలో మైదుకూరు బాయ్స్ హైస్కూల్ ఉపాధ్యా యులు ఎల్.సూర్య నారాయణ రెడ్డి,ఎం.ఐ.వో కార్యాలయ సిబ్బంది సి,ఆర్,పిలు పాలిటెక్నిక్ లెక్చరర్ స్వర్ణకుమారి పాల్గోన్నారు.

## మృత్యుంజయ శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



కడప కార్పొరేషన్, డిసెంబరు 28, ప్రభాతవార్త

ప్రసిద్దిగాంచిన మృత్యుంజయ కుంట శివాలయ పునర్నిర్మాణం కోసం భూమి పూజలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, కడప నగరపాలక సంస్థ మేయర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి అన్నారు. గురువారం కడప మృత్యుం జయ కుంటలోని మృత్యుంజయ శివాలయం పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో శివాలయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పార్వతమ్మ చెన్నారెడ్డి మృత్యుంజయ శివాలయ నిర్మాణానికి గతంలో కృషి చేశారని, కాంపౌండ్‌ను కూడా నిర్మించడంలో వారి కృషి ఉందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రూ.38 లక్షలు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. దాతలు కూడా సహకరించాలని కోరారు. శివాలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. 11వ డివిజన్ కార్పొరేటర్ శ్రీలత, ఇన్‌ఛార్జి భాస్కర్ వర్మ, డైరెక్టర్లు బంగారు నాగయ్య, పసుపులేటి విజయకుమారి, కార్పొరేటర్లు మల్లికా ర్జున, రామలక్ష్మారెడ్డి, శివకోటి రెడ్డి, ఆరీఫుల్లా, నాయకులు తోటా కృష్ణ, రామ్మో హన్‌రెడ్డి, పసుపులేటి మనోజ్, సింధు, ఈఓ శ్రీధర్, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

## దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



బద్వేలు, డిసెంబర్ 28 ప్రభాతవార్త

దేశ స్వాతంత్ర్యంకోసం ఎన్నో బలిదానాలు, ప్రాణత్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌ది అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అచ్యుత రాజు, పీసీసీ సెక్రటరీ ఇమాం సాహెబ్ పేర్కొ న్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ప్రజలకు ఎన్నో సేవలందించి ప్రజల మన్ననలు పొందిందని, రాబోయే కాలంలో తమ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు ఉదా హరణే తెలంగాణాలో కాంగ్రెస్ గెలుపు అన్నారు. ఈ గెలుపు ఏపీలో కూడా పునరావృతం కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ షా, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు మహబూబ్ బాష, కాంగ్రెస్ నాయకులు సర్దార్ సలీం పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్దికి ఉద్యమాలు ఉద్భృతం చేయాలి: సిపిఐ

మైదుకూరు డిసెంబరు 28, ప్రభాత వార్త:

కరువు,వలసలు,ఆత్మహత్యల విముక్తికై నిధులు నికర జలాల సాధన కోసం కడప ఉక్కు ప్యాక్టరీ నిర్మాణం. మూతపడ్డ పరిశ్రమల పునరుద్దరణకొసం ఆర్దీక, రాజకీయ,సామాజిక సమానత్వం కోసం జిల్లా సమగ్రాభివృద్ది కోసం, ఉద్యమాలు ఉదృతం చేయాలని గురువారం స్థానిక డిసియల్ కల్యాణ మండపంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య ఆధర్యంలో జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి.రామయ్య. ఎల్.నాగసుబ్బారెడ్డి యం. సుబ్బారెడ్డి, బషీరున్నిసా, యన్.వెంకటశివ, పి.చంధ్ర శేఖర్, వీర శేఖర్,విజయలక్ష్మి, పి.శ్రీరాములు, పి.భాస్కర్, పీరయ్య పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు జనసేన మద్ధతు

### అసెంబ్లి ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ

రాజంపేట అర్బన్, డిసెంబరు 28 ప్రభాతవార్త

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు రాజంపేటలో జనసేన అసెంబ్లి ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ మద్దతు ప్రకటించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న ధర్నాలో దీక్షా శిబిరంలో మున్సిపల్ కార్మికులను కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులకు ఎన్ని చేసినా తక్కువేనని, ముఖ్యంగా పారిశుద్ధ్యం కార్మికుల పట్ల ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని కోరారు. కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అడుగుతున్నారని, ఇది ఎంతో న్యాయమైన డిమాండ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులు కోట్లు గడిస్తున్నారని, కార్మికులకు వేతనాలు పెంచేందుకు ఎందుకు తాస్కారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులతో పాటు జనసేన నేతల రాటాల రామయ్య, పోలిశెట్టి శ్రీనివాసులు, చౌడయ్య, వీరయ్యఆచారి, కత్తి సుబ్బరాయుడు, గోవర్దన్, రంజిత, శిరీష, మాధవి పాల్గొన్నారు.

## వికలాంగునికి మేఐహెల్ప్‌యూ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబర్ 28, ప్రభాతవార్త

పట్టణానికి చెందిన వెంకట సుబ్బయ్య(35) అనే వ్యక్తి గవర్న మెం ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించగా అంత్య క్రియలు నిర్వహించడానికి బంధు వులు ఎవరు లేకపోవడంతో హాస్పి టల్ సిబ్బంది మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ చైర్మెన్ లక్ష్మణ్‌రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి గురువారం సాయంత్రం హిందూస్మశాణ వాటికలో హిందూ సంప్రదాయం ప్రకా రం అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మెన్ మోరే లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, సుబ హాన్,, కృప అగ్నిషరూన్‌ట్రస్ట్ సభ్యులు కే.సుమన్‌బాబు, సురేష్, శ్రీరామ్ మరియు గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది రవితేజ, గంగాధర్‌కు ఏ శుభ కార్యానికైన పిలవగానే వస్తారు కానీ చావుకు చాలామంది వెనుక ఉంటారు. తెలిసిన బంధువులు చనిపోయిన కూడ చాలామంది ఏమవుతుందో అని వెను కడుగు వేస్తూ ఉంటారూ. కానీ మీరు మాకు ఆత్మీయుల వలె వచ్చి ఈ కార్యక్రమాన్ని చేయడం మాకెంతో సంతోషం అని బంధువులు మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ వారికి కృత జ్ఞతలు తెలిపారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృధ్ధులకు సహాయం చేయ దలచిన దాతలు ఉంటే 82972 53484 నెంబర్‌కు సంప్రదించవలసిందిగా కోరారు.

### పాసుపోర్టు పోయినది

పబ్బులేటి యల్లమ్మ భర్త పి. వెంకటపతి అడ్రస్సు 1/52 చాపలవారిపల్లె, పొత్తపి, నందలరు(మం), అన్నమయ్య (జిల్లా) ఏపి. మా యింటి నుండి నందలూరు బస్టాండుకు పోతుండగా నా పాస్‌పోర్టు పోయినది. నెం. 52669233 దొరికిన వారు పై అడ్రసుకు తెలుపగలరు.

## హామీలు నెరవేర్చడంలో జగన్ సర్కార్ విఫలం

### టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌రాజు

రాజంపేట అర్బన్, డిసెంబరు 28 ప్రభాతవార్త



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో జగన్ సర్కార్ విఫలమైందని, పేద సామాజిక వర్గాలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 1.14 కోట్ల నిధులు దారి మళ్లించి ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ధ్వజమెత్తారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిల అభ్యున్నతికి కేంద్రం మంజూరు చేసిన నిధులన్ని దారి మళ్లించా రని ఆరోపించారు. నేను విన్నాను, నేను ఉన్నానని జగన్ వాగ్దానాలు చేసి గాలి యాత్రలు చేశారని విమర్శించారు. విద్యుత్తు ఛార్జిలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రిలో ఏ ముఖ్యమంత్రి పెంచని విధంగా విద్యుత్ ఛార్జిలు పెంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ముస్లిం మైనార్టీలకు అమలు చేసిన రంజాన్ తోఫా తదితర సంక్షేమ పథకాలన్ని జగన్ పక్కనబెట్టారని మండిపడ్డారు. అమ్మ ఒడి పథకంలో 2 వేలు తల్లులకు కోత విధించారని విమర్శించారు. విదేశీ విద్య పేదలకు దూరమైందని ఆరోపించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు. జాబ్‌క్యాలెండర్ లేకుండా మోసం చేశారని పేర్కొన్నారు. మెగా డిఎస్‌సి ప్రకటించలేదని, ఉద్యోగులకు హామీ ఇచ్చిన సిపిఎస్ రద్దు కూడా చేయకుండా పక్కాగా మోసం చేశారని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన జగన్ సర్కార్‌కు గద్దె దిగే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

## అంగన్వాడీల పట్ల నిరంకుశ వైఖరి తగదు



పోరుమామిళ్ల, డిసెంబరు 28 ప్రభాతవార్త :

అంగన్వాడీల పట్ల ఎమ్మెల్యేల నిరంకుశ వైఖరి తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన దీక్ష 17వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు చేతికి సంకెళ్లు వేసినట్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు ఓట్లు వేయలేదా వారిపట్ల ఎందుకలా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మహిళా ఎమ్మెల్యే సాటి మహిళలైన అంగన్వాడీల సమస్యలపై దృష్టిపెట్టకపోవడం బాధాకరమన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేసేలా అసెంబ్లీలో చర్చించాలని ముఖ్యమంత్రి దృష్టికి పోయి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. నానాటికి తమ సమస్యలు తీవ్రమవుతున్నాయే తప్ప తగడ్డం లేదని అంగన్వాడీలు వాపోయారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి కనీస వేతనం 26వేల పెంపు, రిటైర్డ్ బెనిఫిట్ 5లక్షలు, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించి తమ న్యాయమైనసమస్యలను పర్కిరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు ఓబుళాపురం విజయమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి మేరి, పోరుమామిళ్ల అంగన్వాడీ అధ్యక్షురాలు దస్తగిరమ్మ, సెక్టార్ లీడర్లు రేణుక, జ్యోతి, లక్ష్మిదేవి, శ్రీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అరుణ్ జైట్లి జయంతి వేడుకలు



ప్రొద్దుటూరు డిసెంబర్ 28, ప్రభాతవార్త

కేంద్ర మంత్రి, పద్మ విభూషన్ అవార్డు గ్రహీత జీఎస్టీ రూపకర్త అరుణ్ జైట్లి జయంతి వేడుకలను పట్టణ బిజెపి అధ్యక్షులు వంకధార నరేంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా గురువారం స్థానిక వైఎం ఆర్ కాలనీలోని బిజెపి పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వంకధార నరేంద్రరావు మాట్లాడుతూ ఆమన దేశానికి చేసిన సేవలను కొనిఆడారు. ఆయన చిన్నతనం నుండి సిద్ధాంతాలు కలిగిన అఖిలభారత విధ్యార్ధి పరిషత్, ఆర్ఎస్ఎస్ సంఘంలలోనూ ఉంటూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. అలాగే ఒక న్యాయవాదిగా, కేంద్రమంత్రిగా, జీఎస్టీ రూపకర్తగ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కోకన్వీనర్ గౌరిశంకర్, పట్టణ ఇంచార్జ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు శివకళ్యాణి, జిల్లా బిజేవైఎం సెక్రటరి విక్రాంత్, ప్రధాన కార్యదర్శి చలపతిరావు, కార్యదర్శి వంశీకృష్ణ, బీజేవైఎం టౌన్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రెడ్డి, బిజెపి ఎస్టీ మోర్చా టౌన్ ప్రెసిడెంట్ రాగాల రమణయ్య,, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ.నరసింహ, ప్రకాష్, మీడియా ఇంచార్జ నరేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు చిన్న, మాజీ పట్టణ అధ్యక్షులు కే.గురుప్రసాద్, బిజెని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్సకు ఆర్ధిక సాయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త



తిరుపతి ఓం హాస్పిటల్‌లో ఓబులవారిపల్లె మండలం ఎర్రగుంట కోట గ్రామానికి చెందిన షేక్ అహ్మద్, అయేషా కుమారుడు కిడ్నీ శస్త్ర చికిత్స కోసం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బాధితుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ హమీం, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్క వారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు శాంతియుతంగా ఉండేలా ప్రార్ధనలు చేయండి

### పాస్టర్ల సమావేశంలో టిడిపి ఇంచార్జ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజికవర్గంలో ప్రజలు శాంతియుతంగా జీవనం కొనసా గించేలా ప్రార్ధనలు చేయాలని టిడిపి ఇంచార్జ జీవి ప్రవీణ్ కమార్ రెడ్డి క్రైస్తవ గురువులకు విజ్ఞప్తిచేశారు. గురువారం తన నివాసంలో ప్రొద్దుటూరు పట్టణం లోని చర్చి పాస్టర్లతో సమావేశం ఏర్పాటుచేసి క్రిస్మస్, నూతన సంవ త్సరం సంధర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుతూ వారికి దుస్తులు పంపిణి చేశారు. ఈ సంధర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తనకు శక్తి ఉన్నంత మేరకు క్రైస్తవులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన సహాయం అందించడంలో ముందుంటానని తెలిపారు. ప్రొద్దుటూరులో ఉన్న మూడు లక్షల జనాభా మనశ్శాంతిగా ఉండేలా అరాచక పాలన నుండి ప్రజలకు విముక్తులను చేసేలా జీసస్‌ను ప్రార్ధించాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఖచ్చితంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపడుతారని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని తాను చేసి చూపిస్తానని తెలిపారు.

## జాతీయస్థాయి పోటీలకు శ్రీ వేద విద్యార్థులు

మదనపల్లె, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు శ్రీవేద విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మెన్ రామ్మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్ర రెడ్డిలు తెలిపారు. ఇటీవల తిరుపతిలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌కమ్ సెలక్షన్ జరిగిందన్నారు. ఈ సెలక్షన్‌లో శ్రీవేద విద్యార్థులు బి.ప్రశాంత్, బి.అబ్దుల్‌మన్నన్ ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. అండర్-14 కేటగిరిలో ప్రశాంత్ 60మీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం నిలిచాడనన్నారు. అండర్-16 కేటగిరిలో 600మీటర్ల పరుగుపెందెంలో అబ్దుల్‌మన్నన్ ద్వితీయ స్థానం కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో గుజరాత్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్ మహేంద్రను అభినందించారు.

## వికసిత్ భారత్ కార్యక్రమానికి మహిళల ఘనస్వాగతం



తంబళ్లపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లి దిగువపాలెం పంచాయతీలలో గురువారం వికసిత్ భధారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలను సర్పంచులు లలితమ్మ, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు పంచాయతీలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, పంచాయతీరాజ్ ఏఈ హరినాథ్ పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు గ్రామ సభకు వివరించారు. తొలుత వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనానికి స్థానిక మహిళలు, ప్రజలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అనంతరం వికసిత్ భారత్ కార్యక్రమంలో గ్రామ సభలో ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి ప్రధాని మోదీ సందేశం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు త్యాగరాజు, ఏపీవో అంజనప్ప, అంగన్వాడీ సూపర్‌వైజరు కుసుమారాణి, నాగసుబ్బరాయుడు, బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ మగ్గాల లక్ష్మయ్య, కోఆర్డినేటర్ మనోహర్‌గౌడ్, వాటర్‌షెడ్ ఛైర్మన్లు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులు జ్ఞానశేఖర్‌రెడ్డి, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## సన్యాసివారిపల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

కలికిరి, డిసెంబరు 28, ప్రభాతవార్త:



మండలంలోని మేడికుర్తి పంచాయతీ సన్యాసివారిపల్లెలో గురువారం పీలేరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బాబూ ష్యూరిటీ-భవిష్య త్తుకు గ్యారెంటీ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తెదేపా ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాలంటే రాబోయే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని ప్రజలను కోరారు. కలికిరి మండలంలో అభివృద్ధి జరిగిందంటే తమ నల్లారి కుటుంబం చేసిన అభివృద్ధే అని ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కిశోర్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, మేడికుర్తి మాజీ ఎంపీటీసీ బి.జనార్ధన్‌గౌడ్, కలికిరి మండలం రైతు సంఘం అధ్యక్షులు సురేష్‌కుమార్‌రెడ్డి, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, టీడీపీ నాయకులు ఎద్దులవారిపల్లె శ్రీనివాసులు, యువ నాయకుడు రాఘవేంద్ర, మేడికుర్తి పంచాయతీ టీడీపీ అధ్యక్షులు పూర్ణచంద్ర, టీడీపీ కార్యకర్తలు అమర్‌నాథ్, దామోధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వే ఖచ్చితంగా నిర్వహించాలి

కేవి.పల్లె, డిసెంబరు 28 ప్రభాతవార్తః



ఉపాధిపనుల సామాజిక సర్వే ఖచ్చితంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి పనుల సామాజిక తనికీపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వారం రోజులు పాటు 2022-23 సంవత్సరానికి జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. సామాజిక తనికీ బందం ప్రతి పని వద్దకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి కొలతలు సక్రమంగా తీయాలని అన్నారు. తనికీ సిబ్బందికి కూలీలు ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధి ఏపీఓ నాగరాజ, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సర్పంచ్‌చే అన్నదానం

మదనపల్లె, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు మూడురోజులుగా కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి భోజన వసతి ఏర్పాటు చేశారు. గురువారం రూరల్ మండలంలోని క్రీడాకారులందరికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌చే అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొంది, క్రీడాకారులు ఉన్నత బహుమతులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి వెంకటసుబ్బయ్య, డిటి రాజేష్, పంచాయతీ సెక్రటరీ శ్రీహరి, బాబా, నాయకులు కుమార్, పునిత్ తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ మృతదేహానికి నివాళి

– గోపాల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన అధికారులు

రామాపురం, డిసెంబరు 28, ప్రభాతవార్త:



మండలంలోని సుద్దమల్ల పంచాయతీ హరిజనవాడకు చెందిన ప్రొడక్షన్ వాచర్ గోపాల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గోపాల్ మృత దేహానికి గురువారం ఫారెస్ట్ అధికారులు కడప డీఎఫ్ఓ వివేక్, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో నాగమనేశ్వరి, రాయచోటి రేంజ్ అధికారి కె.స్ఫూర్తి గోపాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు తక్షణ సహాయార్థం రూ.50వేలు ఆర్థిక సాయం అందించి ఓదార్చారు. వారి వెంట రాయచోటి సెక్షన్ ఆఫీసర్ రఘు శంకర్, వంగిమల సెక్షన్ ఆఫీసర్ భరణి కుమార్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన మాజీ ఎమ్మెల్యేలు

మదనపల్లె, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



కుప్పం పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మదనపల్లె మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, దొమ్మలపాటి రమేష్‌లు కలిశారు. గురువారం బెంగుళూరు ఎయిర్‌పోర్టులో చంద్రబాబునాయుడును కలసి శాలువతో సత్కరించారు. వారితో పాటు తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, నియోజకవర్గ నాయకులు శ్రీరామనేని జయరామ్‌నాయుడు తదితర నాయకులు కలసి నియోజకవర్గ రాజకీయంపై ఆయన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు.

## సబ్‌కలెక్టరేట్ వద్ద సిపిఐ నాయకులు ధర్నా

మదనపల్లె, డిసెంబర్ 28 ప్రభాతవార్త :




జాతీయ రహదారి విస్తరణలో ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలంటూ గురువారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్ళు గ్రామ పంచాయితీ సర్వేనెంబర్ 628లో 4.03ఎకరాలు 75మందికి ఇంటిస్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చారన్నారు. సౌకర్యాలు లేక ఇండ్ల నిర్మాణం ఆలస్యం అయ్యిందన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లస్థలాలన్నీ పోయాయన్నారు. స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు క్రిష్ణప్ప, సాంబశివ, మురళి, తిరుమల, మున్సిపల్ వర్కర్స్ నాయకులు సురేష్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



రామసముద్రం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం గురువారం నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్, జిల్లా కిసాన్ మెంబర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ సర్కిల్‌లో ఇందిరాగాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ లీలా శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగం రామక్రిష్ణారెడ్డి, శ్రీదేవి,దింబాల అశోక్‌రెడ్డి, ఆనందరెడ్డి, గుండాల రామచంద్ర, పవన్, మండలపార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



మిట్స్ కళాశాల విద్యార్థులకు ఫిలిమేకర్స్‌క్లబ్ నిర్వహించిన సినీక్రాఫ్స్ పోటీలలో ప్రతిభ కనపరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా పోటోగ్రఫీ, రీల్స్, స్క్రిప్ట్ రైటింగ్ యాక్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను విద్యార్థులు తీసిన ఫోటోలు, రీల్స్, షార్ట్‌ఫిల్మ్స్‌ను ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ మాటాలడుతూ ఫిలిమేకర్స్ క్లబ్ వారు ఫోటోగ్రఫి వీడియోలపై విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి దోహదపడ్డాయని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశాంసాపత్రాలు అందజేశారు. ఈ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ, కోఆర్డినేటర్లు అభినందించారు.

## ఆడుదాం ఆంధ్ర విజయవంతం

కలికిరి, డిసెంబరు 28, ప్రభాతవార్త:



మర్రికుంటపల్లె పంచాయతీలో గురువారం జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలికిరి మండలం ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్, జడ్పీటీసీ పద్మజా లోకవర్ధన్, ఎంపీడీవో గంగయ్యలు హాజరై ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలోని గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో యువకులు, పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి వారిని రాష్ట్ర స్థాయిలో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం ప్రత్యేక ఆహ్వానితులు శివయోగి శివాజీ, వైసీపీ నాయకులు బాబురెడ్డి, కలికిరి మండలం వైసీపీ మైనార్టీ యువనాయకుడు వేంపల్లె బావాజీ, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయం కార్యదర్శి జనీఫారాణి, పీఈటీ రఘు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



మదనపల్లె, డిసెంబర్ 28 ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం గురువారం నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బెంగుళూరు బస్టాండు వరకు ర్యాలీగా వచ్చి ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మదనపల్లెలోనే పార్టీ గుర్తుగా హస్తంను ఎంపికచేయడం జరిగిందన్నారు. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్‌కె.బాషా, జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటరమణ, చలపతి, రూరల్ అధ్యక్షులు సురేంద్రరెడ్డి, నాయకులు మహబూబ్‌ఫీర్,మహమ్మద్‌రఫీ, సోమశేఖర్, రవీంద్ర, శరత్‌కుమార్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు పరిశీలన




కురబలకోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త :

జాతీయ ఉపాధిహామీ గ్రామీణ పథకం కింద కురబలకోట మండలంలో చేపట్టిన పనులను గురువారం కేంద్ర జలశక్తి అభియాన్ అధికార బృందం పరిశీలించారు. మండలంలోని కడపక్రాస్ వద్ద ఏపి మోడల్‌స్కూల్ ఆవరణంలో ఈ పథకం కింద చేపట్టిన రూట్‌వాటర్, ఆర్‌విస్టిన్‌ను, స్ట్రక్షర్‌లో పరిశీలించారు. అదే విధంగా రెండు ఓర్‌వెల్ రీచార్జ్ పనులను పరిశీలించారు. ఈ రెండు పనులను 65వేల200 రుపాయలతో చేపట్టినట్లు అధికార బృందానికి ఏపియూ వెంకటేష్, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఏపిడి మద్దిలేట్లు వివరించారు. కేంద్రంబృందం పరిశీలకులు ప్రకాష్, ఏఎస్ పవార్‌లు ఈ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరిసాబ్, గ్రామ సర్పంచ్ సులోచన, ఎంపిటిసి నిర్మల, సెక్రటరీ రామప్ప, ఉపాధిహామీ అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాజశ్యామల చండీ హోమానికి ఆహ్వానం

పీలేరు, డిసెంబరు 28 ప్రభాతవార్తః



తెదేపా జాతీయ అధ్యక్షులు ప్రధాన ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలని మదనపల్లెలో జనవరి 6,7,8 తేదీలలో జరుగుతున్న శ్రీదశ మహావిద్య సమేత మహారాజ శ్యామల చండీ హోమం జరుగుతున్న కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికు కట్టా దొరస్వామినాయుడు ఆహ్వాన పత్రిక అందజేశారు. చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం కావాలని తంభళ్లపల్లెకు చెందిన కట్టా దొరస్వామి నాయుడు హోమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు అవుతున్నట్లు తెలిపారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం

పీలేరు, డిసెంబరు 28 ప్రభాతవార్తః



కాంగ్రెస్ పార్టీ స్థాపించి 139 సంవత్సరాలైన సందర్భంగా పీలేరు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమత తేజ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం కూడా భారతదేశ నిర్మాణంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని తెలిపారు. ఉపాధిహామీ పథకం ఆర్టీఐ చట్టాలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ నిధులు ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మఇళ్లు, ఫీజురీయంబర్సు మెంటు, రాజీవ్ యువకిరణాలు, ఒక్క రూపాయికే బియ్యం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలంటే అది కాంగ్రెస్ పార్టీ దేశ నాయకత్వం ఇప్పటికే పలుమార్లు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటిస్తామని తెలిపారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఎన్ఎస్‌యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సంపత్‌కుమార్, యూసఫ్, రహంతుల్లా, చాంద్‌బాషా, బసవయ్య, జనార్ధన్, ఎర్రయ్య, రామమూర్తి పాల్గొన్నారు.

## పేదల అభివద్దే సీఎం జగనన్న ఆశయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు, డిసెంబరు 28 ప్రభాతవార్తః



పేదల అభివద్ది సంక్షేమమే రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం పట్టణంలోని రజకుల, నాయిబ్రాహ్మణ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివద్ది సంక్షేమ పథకాలు చదివి వినిపించారు. అభివద్ది, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించి రెండోసారి సీఎంగా చేయాలని కోరారు. స్థానికంగా వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, నరసింహారెడ్డి, చలపతి, భాస్కర్‌రెడ్డి, వైకాపా నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గహసారధులు పాల్గొన్నారు.

## హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కురబలకోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని గురువారం హెల్పింగ్‌మైండ్స్ హరినాథ్‌రెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మిత్ర బృందం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో స్వర్గస్తులైన మిత్రుల జ్ఞాపకార్థంఆ రక్తదాన, అన్నదాన శిబిరాలు నిర్వహించినట్లు హెల్పింగ్‌మైండ్స్ అబూబక్కర్ సిద్ధిక్ తెలిపారు. ఈశిబిరంలో విద్యార్థులు వందమంది పాల్గొని రక్తదానాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లి, పవన్, కార్తీక్, అల్తాఫ్,గోపాల్, రాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాను తరిమికొట్టండి

మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్

కురబలకోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త :



వర్గవిబేధాలు పక్కనపెట్టి రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేసి ఆరాచక వైకాపాను తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని తంబళ్ళపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. అంగళ్ళులోని భారత్ కళ్యాణ మండపంలో జనసేన, టిడిపి పార్టీల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100రోజుల్లో ప్రతి కార్యకర్త కష్టపడి బాబుషూరిటీ, భవిష్యత్తుకు గ్యారింటి అన్న పథకాలను ఇంటింటికి తెలియజేసేలా కృషి చేయాలన్నారు. ఈ పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుక పనిచేయాలన్నారు. నియోజ కవర్గ పరిశీలకులు రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాజంపేట పార్లమెంటరీ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, కస్లర్ ఇన్‌ఛార్జ్ వైజి.రమణ, కన్వీనర్ సురేంద్ర, జనసేన నాయకులు సాయి, రామాంజులు, తెలుగుయవత అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, గౌని లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల పోస్టుకార్డు ఉద్యమం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త:



న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు పోస్టు కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ, ప్రభావతిలు మాట్లాడుతూ 17 రోజులుగా సమ్మె చేస్తున్నా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. శిబిరంలో అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కారం చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, పెద్ద ఎత్తున నినదించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాలు రుక్మిణి, రవణమ్మ, నాగమణి, శిరీష, వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

– టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, డిసెంబరు 28, ప్రభాతవార్త:



మండలంలోని మొయిళ్ల కాల్వ గ్రామంలో గురువారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన కుమారుడు పుత్తా చైతన్య రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు వచ్చే ఎన్నికల్లో సీఎం అయితేనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అలాగే గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కమలాపురం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కమలాపురం అభివృద్ధికి, పెండ్లిమర్రి మండలం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిశోర్‌రెడ్డి, అన్నమయ్య, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మినుములో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



పెండ్లిమర్రి, డిసెంబరు 28, ప్రభాతవార్త:

కేవీకే ఊటుకూరు ద్వారా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనలు ద్వారా మినుములు జీబీజీ 01 విత్తన రకంతో పాటు కీలక ఉపకరణాలను సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని మరియు నిర్దిష్ట సమయంలో క్షేత్ర సందర్శనలు, సలహాలు ఇవ్వడం ద్వారా లబ్ధిదారులు అధిక దిగుబడులు పొందడం జరిగింది. పెండ్లిమర్రి మండలంలోని ఎస్.చెర్లోపల్లె గ్రామంలోనే ఎస్.సోమిరెడ్డి పొలంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డా.ఎ.వీరయ్య మాట్లాడుతూ జీబీజీ 01 అనే మినుము రకం పల్లాకు తెగులును తట్టుకునే పాలిష్ రకం ఇది 70-75 రోజుల పంట కాలానికి 8-9 క్వింటాళ్ల దిగుబడి ఎకరానికి ఇస్తుందని మరియు ఇది అన్ని కాలాలకు అనువైన రకమని తెలిపారు. అలాగే విత్తనశుద్ధి 4 సాళ్లలో జొన్న, సజ్జ పంటలతో రక్షణ పంటలను అలాగే తెల్ల దోమ, తామర పురుగులు నివారణకు ఎకరాకు 20 చొప్పున పసుపు రంగు, మరియు నీలి రంగు జిగురు అట్టలను వాడుకోవాలని రసాయన పురుగు మందులను విచక్షణారహితంగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వాడుకోవాలని తద్వారా వాతావరణ భూకాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా.టి.మహేష్‌బాబు, ఎస్.చెర్లోపల్లె మరియు రేపల్లె గ్రామానికి చెందిన 40 మంది రైతులు పాల్గొన్నారు.

## స్పర్శలేని మచ్చలు - కుష్టు వ్యాధి కావచ్చు అంశంపై అవగాహన

పీలేరు, డిసెంబరు 28 ప్రభాతవార్తః



కుష్టువ్యాధిపై భయాలను విడనాడి వ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు అందరూ సహకరించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి పల్లె ప్రజలను కోరారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తలపుల పరిధిలోని జాండ్ల గ్రామంలో స్పర్శలేని మచ్చలు- కుష్టు వ్యాధి కావచ్చు అనే అంశంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రే అనే క్రిమి వల్ల వచ్చే కుష్టు వ్యాధి ఇతర అంటు వ్యాధుల వలె ఒక సామాన్య అంటువ్యాధి అని నిర్ధారణ అయినా కుష్టు వ్యాధి చికిత్స సక్రమంగా తీసుకుంటే ఏదశలో ఉన్న పూర్తిగా నయమవుతుందని బహుళ ఔషద చికిత్సతో పూర్తిగా నివారణ పొంది, సామాజిక జీవనం గడపవచ్చునన్నారు. ఈచికిత్స అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభించునన్నారు. కుష్టు వ్యాధి రహిత సమాజానికి చేయూత ఇవ్వండని డాక్టర్ రమేష్‌రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రీను, పాముస్నీసా, నాగసుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో ప్రజలపై పన్నుల భారం మోపడం దారుణం

పీలేరు, డిసెంబరు 28 ప్రభాతవార్తః



ప్రజల్లోకి వెళ్లి ప్రజా బలంతో గెలిచే ధైర్యం లేక దొంగ ఓట్లు సష్టించి అక్రమాలకు పాల్పడి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న జగన్‌రెడ్డి జిమ్మిక్కులు ఇక చెల్లవని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని పాతబస్టాండు, నెహ్రూబజార్, బ్రాహ్మణవీధి పలు చోట్ల బాబుషూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని 2024 ఎన్నికల్లో తెదేపా ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు నిత్యావసరాలు, ఇంటి పన్నుల భారం ప్రజలపై మోపి వ్యవస్థలను సర్వనాశనం చేసి మరోసారి తప్పుడు మార్గంలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న జగన్‌రెడ్డి ఆటలు ఇక సాగవని జగన్‌రెడ్డి పాలనంతా ప్రజల్ని దోచుకోవడం, తాడేపల్లెలో దాచుకోవడమేనన్నారు. పీలేరు పట్టణంలో కిశోర్‌కుమార్‌రెడ్డి రాకతో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ ప్రచారం జోరందుకుంది. పలు వీధుల్లో ఆయనకు ప్రజలు కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఆయనతోపాటు తెదేపా, జనసేన నాయకులు, మహిళా సంఘాలు పాల్గొని పట్టణంలో నినాదాలతో హోరెత్తించారు. ఆయనతోపాటు పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బెజవాడ దినేష్ కార్యకర్తలతో బాబుషూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని కిశోర్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా శ్రేణులు, జనసేన నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మేడా

రాజంపేట అర్బన్, డిసెంబరు 28 ప్రభాతవార్త

రాజంపేట నియోజకవర్గానికి చెందిన నలుగురికి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి గురువారం లబ్ధిదారులకు అందజేశారు. సిఎం సహాయనిధి కింద నందలూరు మండలానికి చెందిన శివకుమారికి 50 వేలు, ఎస్.సుధాకర్‌రెడ్డికి 3.50 లక్షలు, బోగా మౌనిక లక్ష రూపాయలు, ఒంటిమిట్ట అయ్యవారమ్మకు 30 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పృథ్వీపరెడ్డి, జి.సుబ్బారెడ్డి, కృష్ణారావు, టంగుటూరు సర ్పంచ్ మైను ద్దీన్, సింగిల్‌విండో అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధి రహిత మండలంగా కృషి చేయాలి

### జిల్లా కుష్ఠు నివారణ అధికారి డా.రవిబాబు



చాపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

మండలాన్ని కుష్ఠు వ్యాధి రహిత మండలంగా కృషి చేయాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డా.రవిబాబు వైద్య సిబ్బంది సూచించారు. గురువారం చాపాడు ప్రాథమిక వైద్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈనెల 27వ తేది నుండి జనవరి 12వ తేది వరకు జాతీయ కుష్ఠు వ్యాధి నిరూ ళన కార్యక్రమం జరుగుతున్నందున ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కుష్ఠు వ్యాధి గురించి వివరిస్తూ ఎవరికైన చర్మం పాలిపోయిన, రాగివర్ణంలో పొడలు, మచ్చలు, మచ్చలపై స్పర్శ లేకున్న, మచ్చలపై చమట పట్టిన, చేతులలో స్పర్శ లోపించిన కుష్ఠు వ్యాధిగా పరిగణించాలని వివరించారు. ఈ వ్యాధిని 6నెలల నుండి 12నెలల వరకు బహుళ ఔషధ చికిత్స ద్వారా నివారించవచ్చు అన్నారు. ఎండీటీ చికిత్స అనంతరం వైకల్యం ఉంటే ఉచితంగా శస్త్రచికిత్స చేసి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సహకాలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో ఏ ఒక్కరికి పైన పేర్కొన్న లక్షణాలపై అనుమానం కలిగితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి తెలుసు కోవచ్చు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కావ్యమాధురి, ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : జెసి




ముద్దనూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త:

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నాడు కడప జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పర్యవేక్షించడం జరిగింది. మండల మొత్తం జరుగుతున్న క్రీడల ను మండల అధికారులతో చర్చించారు. మూడవరోజు వాలీబాల్ క్రీడలలో పాల్గొ న్న క్రీడాకారులను జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు జెసి రామునాయక్ పరిచయం చేసుకొని, స్నేహ పూర్వకంగా మంచి వాతావరణంలో ఆడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ సూర్య నారా యణరెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు సుబ్బారావు, నాగేశ్వర నాయక్, హెచ్‌ఎం రాజబాబు, సెక్రటరీలు సుమలత, వీరభద్రుడు, జూనియర్ అసిస్టెంట్ విజయభాస్కర్, ఫిజికల్ డైరెక్టర్లు మాధవరెడ్డి, దేవిక, యోగమాస్టర్ రాంకుమార్ పాల్గొన్నారు.

## టిడిపి నేతలను కించపరిచేలా వ్యూహం చిత్రాన్ని అడ్డుకుంటాం

### తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు



ప్రొద్దుటూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేతల మనోభావాలను కించపరుస్తూ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ చిత్రీకరించిన వ్యూహం చిత్రాన్ని అడ్డుకుంటామని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు హెచ్చరించారు. ఈ సంధర్భంగా గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. మహిళలను అగౌరవరుస్తూ ఆట బొమ్మలా చూసే సైకో ఆర్జీవి తీసిన చిత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ముద్దులు పెడుతూ ఇచ్చిన హామీ లను అమలుచేయక యువతను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని పాతాళంలోకి నెట్టేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే అంగన్వాడి కార్యకర్తలు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మి కులు తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డు ఎక్కిన సంగతి తెలిసిందే అన్నారు. చివరకు తనకెంతో ఇష్టమైన వాలంటీర్లు కూడ సమ్మె చేసేందుకే నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ ఆసమర్ధ పాలనకు అద్దం పడుతుందన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిం చాల్సింది పోయి ఇలాంటి చిత్రాలను ప్రోత్సహించి మరోసారి ప్రజలకు మోసం చేసే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టి వైసిపి ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. కనీసం మూడు నెలల్లో పాలనపైన రాష్ట్ర అభి వృద్ధిపైన దృష్టి పెట్టి ప్రజాభిమానం పొందాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షులు నవీన్ కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎస్సి నాయకుడు చెన్నయ్య పాల్గొన్నారు.

## నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం



రాజుపాళెం,డిశంబరు28,ప్రభాతవార్త

మండల పరిధిలోని కొట్టాల గ్రామంలో నూతనంగా రామాలయం, శివాలయంలు దాతల సహకారంతో నిర్మాణదశలో ఉన్న ఆలయాలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇటీవల విరాళం ప్రకటించిన సందర్బంగా గురువారం ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి రూ.5లక్షలు నగదు ఆలయ కమిటి సభ్యులకు ఆలయంలో అందించారు.ఈకార్యక్రమంలో ఎంపిపి సలోమి,మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, రంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బలరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి,కొండారెడ్డి పాల్గోన్నారు.

## ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

### టిడిపి ఇంచార్జ్ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు డిసెంబర్ 28, ప్రభాతవార్త



ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలంటే టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితేనే సాధ్యమవుతుందని టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని మైదుకూరు రోడ్డులోని ఓబయ్య టీస్టాల్, కొత్త బస్టాండ్ ప్రాంతాలలో నిర్వహించిన బాబుష్యూరిటి-భవిశ్యత్తుకు గ్యారెంటీలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రకటిం చిన మిని మేనిఫెస్టోలోని ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆయన కరపత్రాలు పంపిణి చేశారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి శ్రీనివాసులు, పొట్టి పాడు గంగాధర్, కృష్ణారెడ్డి, రాఘవ, కరీముల్లా, సురసుర శ్రీనివాసులు, రాష్ట్ర దేవాం గ కమిటి సభ్యులు మధుబాబు, పెన్నానగర్ మసీద్, కడప జిల్లా అధికార ప్రతి నిధి ఆవుల దస్తగిరయ్య, అమృతనగర్ బాబాఫకృద్దీన్, పుల్లయ్య, కమాల్ బాష, ఆర్‌ఎంపీ వైద్యులు ప్రసాద్, ఐటిడిపి ఇంచార్జ్ శంశుద్దీన్, టిడిపి మండల ఉపా ధ్యక్షుడు షరీఫ్, సుందరయ్యకాలని సుబ్బరాయుడు, టిడిపి నాయకులు, కార్య కర్తలు, నందమూరి అభిమానుల పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మహిళలను అన్ని రంగాలలో సంపన్నులను చేస్తాం

### మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు డిసెంబర్ 28, ప్రభాతవార్త



2024 ఎన్నికలలో రాష్ట్రంలో వచ్చేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ మేనని మహిళలకు అన్ని రంగాలలో సంపన్నులను చేస్తామని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థాని క 29వ వార్డులో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబుష్యూరిటి భవిశ్య త్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా తెలుగు దేశం పార్టీ ప్రకటించిన మిని మెనిఫెస్టో లోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిని చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనాయకులు నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘు రామిరెడ్డి, కడప పార్లమెంట్ సెక్రటరీ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు జింకా రామకృష్ణ, పట్టు పోగుల మధుసూధన్, ఉమ్మడి శెట్టి రోహన్‌కుమార్, వాసవి బాబు, కుంటుమల్ల రంగస్వామి, సింగనమల్ల ఆంజనేయులు, శీలా రమణయ్య, వెంకటసుబ్బయ్య, మేరువ సుబ్బయ్మ, జింకా రాజశేఖర్, ఉమ్మడిశెట్టి చౌడయ్య, వద్ది రమణ పాల్గొన్నారు.

## నూతనంగా అన్నపూర్ణ మందిర నిర్మాణం

### - ఎగ్జిక్యూటీవ్ ట్రస్ట్ డా.రామ్ మనోహర్‌రెడ్డి దంపతులు



కడప వైద్యవిభాగం, డిసెంబరు 28, ప్రభాతవార్త

కడప నగరం బాకరాపేట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నూతనంగా అన్నపూర్ణ మందిరం నిర్మాణం, పాత ప్రేయర్ మంది రాన్ని కూడా రెన్యువేషన్ చేయించి ఏసీ నిర్మాణం చేపడుతున్నామని ఎగ్జిక్యూటీవ్ ట్రస్ట్ ప్రముఖ డా.రామ్ మనోహర్‌రెడ్డి దంపతులు అన్నారు. గురువారం వారు అన్నపూర్ణ మందిరం నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లా డుతూ గణపతి సచ్చిదానంద స్వామి ఆదేశాల మేరకు వారి ఆశీర్వాదంతో పర్మినెంట్‌గా నూతనంగా అన్నపూర్ణ మంది రాన్ని నిర్మిస్తున్నామని పాత మంది రాన్ని కొత్తగా రెన్యువేషన్ చేసి ఏసీ ఏర్పాటు చేస్తున్నామని త్వరగా ఈ నిర్మాణం పూర్తి చేసి గణపతి సచ్చిదానంద స్వామిని ఆహ్వానించి వారితో ప్రారంభిస్తామని ప్రజలు కూడా సహకరించాలని కోరారు. మాతృ మండలి ఉపాధ్యక్షులు ఎల్. విజయకుమారి, ఎగ్జిక్యూటీవ్ ట్రస్టులు నరసింహులు, ఎల్. శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ దత్తసాయి మందిరంలో మొదటి ఆదివారం గణపతి హోమం, రెండో ఆదివారం అనఘాష్టమి వ్రతం, 3వ ఆదివారం దత్తాత్రేయ తైలాభిషేకం, 4వ ఆదివారం సుబ్రమణ్యం స్వామికి, క్షీరాభిషేకం, ప్రతి గురువారం, అన్నదానం చేస్తున్నామన్నారు.

## ఉపాధి హామీ పనుల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

### అడిషనల్ పిడి నాగరత్నమ్మ



రాజుపాళం,డిశంబరు28,ప్రభాతవార్త

గ్రామీణ ఉపాధిహామి పథకంలో పనులు చేయటంతోపాటు చేసిన పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని,జిజిఐ ప్యారామీటర్లు తప్పకుండా నిర్వహించాలని టిడిషనల్ పిడి నాగరత్నమ్మ తెలిపారు.మండల కేంద్రమైన రాజుపాలెంలో గురువారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేధిక ఎంపిడి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగినది.ఈకార్యక్రమంనకు పర్యవేక్షణఅధికారిగా అడిషనల్ పిడి నాగరత్నమ్మ హాజరైనారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేసేపనులు గ్రామానికి ఉపయోగకరంగా,కూలీలకు ఉపాధికల్గించేవిధంగా ఉండాలని తెలిపారు. పథకం లక్ష్యం నేరవేర్చుటతో పాటు ఎక్కడ నిదులు దుర్వినియోగం కాకుండా చూడాలని తెలిపారు.మండల వ్యాప్తంగా 5కోట్ల 23 లక్షలనిధులు సంబంధించిన పనులకు సామాజిక తనిఖీ యస్ఆర్‌పి లక్ష్మినారా యణ ఆద్వర్యంలో డిఆర్‌పిలు, వియస్ఏలు గ్రామలలో తనిఖీ చేసినపనులు ఆపనులు చేసిన కూలీల వేతనాలు,మెటీరియల్ సంబందించిన వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదికలను డిఆర్‌పిలు సమరి ్పంచారు. మండల వ్యాప్తంగా రూ.3271లు అవకతవకలు జరిగినట్లు దీనిని రికవరీ చేసినట్లు ఏపిఓ లక్ష్మినారా యణ తెలిపారు.పంచాయితీరాజ్‌శాఖ పనులపైన పంచాయితీల వారిగా పనులలో జరిగిన పొరపాట్లపైన చర్చ జరిగినది. కార్యక్రమంలో ఏపిఓ గంగయ్య,డివిఓ యోగాంజ నేయరెడ్డి,క్వాలిటి కంట్రోల్ అధికారి విజయ భాస్కర్,ఏపిడి ఆనంద్, పంచాయితీ కార్యదర్శులు, డిఆర్‌పిలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదినారాయణనాయుడు భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సుగవాసి

చిన్నమండెం, డిసెంబర్ 28(ప్రభాతవార్త):

చిన్నమండెం మండల పరిధిలోని దిగువగొట్టివీడు కమ్మపల్లెలో ఏపీఎస్పీ డీసీఎల్ దేవగోపాల్‌నాయుడు తండ్రి ఆదినారాయణనాయుడు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## బియ్యం పంపిణీలో అలసత్వం వద్దు

### తహశీల్దారు వైఎస్ సత్యానందం



నందలూరు, డిసెంబరు 28 ప్రభాతవార్త

నందలూరు మండలం లోని తహశిల్దారు కార్యాలయం లో గురువారం రేషన్‌షాప్ డీలర్లకు, ఎండియు ఆపరేటర్ల కు తహశిల్దారు సత్యా నందం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఒకటో తేదీ ఉదయం నుండి బియ్యం సరఫరా చేయాలని ఆయన తెలి పారు. ఈనెల నుంచి వాలంటీర్లను కలుపుకొని ఎండియు ఆపరేటర్లు ఇచ్చిన గడువు లోపలే సరఫరాను ముగించాలని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీని వాసులు మాట్లాడుతూ పిఎం సరఫరా చేసే స్థానంలో ఉదయం 6 గంటల నుంచి మొదలు పెట్టాలని ఎండియు ఆపరేటర్ల వెంబడి వాలంటీర్లు కచ్చితంగా వెళ్లేలా చూడాల్సిన బాధ్యత విఆర్‌ఒలపైన ఉందని అన్నారు. విఆర్‌ఒలు ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ సరఫరా కచ్చితంగా జరుగుతుందా లేదా అనేది చూసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దారు మోహన్ కృష్ణ, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సుశీల్‌కుమార్, విఆర్‌ఒలు, స్టోర్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు జనసేన మద్దతు



ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 28, ప్రభాతవార్త

సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె మూడవ రోజుకుచేరింది. మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ప్రొద్దు టూరు యూనియన్ నాయకులు, కార్మికులు 240మంది మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి చెవిలో పువ్వులు పెట్టుకొని తమ నిరసనను వ్యక్తం పరి చారు. ఈ సంధర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ జగనన్నా ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. మున్సి పల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆప్కాస్ రద్దు చేసి, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, నేటి ధరలకు అనుకూలంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, ఆరునెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. జీఓ నెంబర్ సెవెన్ ప్రకారం క్యాబ్ డ్రైవర్లకు 18500జీతం ఇవ్వాలని, ఆరు నెలలపెండింగ్‌వేతనాలు ఇవ్వాలని, కరోనాలో తీసుకున్న కార్మికులకు ఆప్కాస్‌లో కలపాలి వారికి వేత నాలు పెంచాలని డిమాండ్‌చేశారు. చనిపోయిన కార్మికుల స్థానంలో తొంద ్రగా ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పట్టణ కమిటి లీడర్లు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చంటి, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గురమ్మ, రమాదేవి, సీతమ్మ, శాంతి, మరియమ్మ, నరసమ్మ, అన్న పూర్ణ, మోహన్, ఓబయ్య, సురేష్, జాకోబు, సుధాకర్, లంకా రవితో పాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమ్మెకు మద్దతుగా జనసేన నాయకులు జీలాన్ బాష, లక్ష్మణ్ సింగ్, ప్రసాదు వారి తరపున మద్దతు తెలిపారు.

## సెంట్రల్ నోడల్ ఆఫీసర్ల పర్యటన



చిన్నమండెం, డిసెంబర్ 28(ప్రభాతవార్త):

మండలంలోని దిగువగొట్టివీడు, దేవగుడిపల్లె గ్రామాల్లో సెంట్రల్ నోడల్ ఆఫీసర్లు ప్రకాష్‌కిచ్చి, ఏఎస్ పవర్ సర్‌లు పర్యటించారు. దిగువ గొట్టివీడులో కమ్యూనిటీ సోక్ ఫిట్, దేవగుడిపల్లెలో బోర్‌వెల్ రీచార్జ్ పనులను తనికీ చేశారు. జిల్లాలో సంభవించిన కరువు పరిస్థితులు గురించి రాయ చోటి ఏపీడీ రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య, ఏపీఓ మాధవి, జేఈ హరూన్ బాషా, క్లస్టర్ టీఏలు నరసింహులు, సంపత్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించిన డీపీఓ

చిన్నమండెం, డిసెంబర్ 28(ప్రభాతవార్త):

మండలంలోని మల్లూరు, టి.చాకిబండ చెత్త నుండి సంపద తయారీ కేంద్రా లను గురువారం డీపీఓ ధనలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వర్మీ కంపోస్టు తయారు చేసి ఆర్బీకేలకు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచిం చారు. వారి ద్వారా రైతులకు అందజేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, సెక్రటరీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

### - డా.మహేష్‌నాయక్



గాలివీడు, డిసెంబర్ 28(ప్రభాతవార్త):

కరోనా వ్యాప్తి దృష్ట్యా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చిన్నపిల్లల వైద్యులు డా.మహేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస పరిసర ప్రాంతాలలో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే నీటిలో దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరోనా ద్వారా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున మాస్క్‌తో పాటు కోవిడ్ నిబంధనలు పాటించడం ఉత్తమం అన్నారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల నివారణ కోసం కాచివడబోసిన నీటినే తాగాలన్నారు. దోమలు దరిచేరకుండా దోమ నిరోధకాలు, దోమతెరలు వాడాలన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు



గాలివీడు, డిసెంబర్ 28(ప్రభాతవార్త):

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్ఐ బాలాజీ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని గాలివీడు గ్రామం బుట్టిగారి పల్లె నల్లగుట్టలో ఆక్రమిత ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1547-ఏలో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానికంగా ఉన్న రాళ్లు కొట్టి మేస్త్రీ తన వద్ద రాళ్లు కొట్టే కూలీలను బెదిరించి వారి పట్టాలను కొనుగోలు చేయడంతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున ్నట్లుగా స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశం మేరకు ఆర్ఐ బాలాజీ ఆక్రమిత భూములను పరిశీలించారు. అనంతరం ఆక్రమన నిర్మాణాలను పరిశీలించి త్వరలోనే వాటిని తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆక్రమనలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు ఉన్నారు.

## పౌర సరఫరాల గోదాము ఆకస్మిక తనిఖీ



లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లె పౌరసరఫరాల గోదామును ఆర్డీవో రంగస్వామి ఆక స్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముందే నిత్యా వసర సరుకులు పంపి ణీ చేయాలని అన్నారు. గోదాము పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. ఏఏ వస్తువులు ఏఏ సమయంలో పంపిణీ చేశారని పూర్తి స్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్కిరెడ్డిపల్లె రామాపురం గాలివీడు మండలాల నిత్యావసర సరుకులు బియ్యం, పంచదార, కందిబేడలు, అంగన్ వాడీ సెంటర్ల కు చెందిన పామాయిల్ పౌష్టికాహార కిట్లను అందు బాటులో ఉన్నాయని డీటీ తెలిపారు. గోదాంలో మొత్తం బియ్యం 290046 మెట్రిక్ టన్నులు, పంచదార 31500 మెట్రిక్ టన్నులు, కందిపప్పు 3405 మెట్రిక్ టన్నులు, గోధుమపిండి 36670 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నా యన్నారు. ఆర్డీవో డీటీలు సంక్రాంతి పంపి ణీ చేయాలని తెలిపారు. ఈనెల 31లోగా రేషన్‌షాపు సరుకులు అందిం చాలని తహసీల్దారు ఉదయ్‌శంకర్‌రాజు డీటీ మల్లికార్జునకు సూచించారు.

## రూ. 40లక్షలతో బ్రిడ్జ్, కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ



కడప డిసెంబర్ 28, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోం దని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్ భాష, కే సురేష్ బాబు సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం 6వ డివిజన్ పరిధిలో కొండాయపల్లె విద్యుత్ నగర్ నందు కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వ ర్యంలో సీసీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంజాద్ భాష మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతోందని అన్నారు. గత పాల కులు నాయకులు నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి చేయలేకపోవడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లుగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ నగర్ నందు జిజిఎంపి నిధుల కింద రూ.40 లక్షల అంచనా వ్యయంతో కాల్వ బ్రిడ్జ్, 2 కల్వర్టులకు అంజాద్ భాష చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరిగింది.

ఆలయ అభివృద్ధి కొరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అంచనా నిధులు రూ. 38.50 లక్షలతో నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం అంజాద్ భాష, కే సురేష్ బాబుల చేతుల మీదుగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## పొన్నంపల్లెలో 15 కుటుంబాలు తెదేపాలో చేరిక



జమ్మలమడుగు, డిసెంబరు 28, ప్రభాతవార్త

మైలవరం మండలం పొన్నం పల్లె గ్రామంలో గురువారం జమ్మల మడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటిం చారు. అనంతరం ఎస్సీ కాలనీలోని 15కుటుంబాలు భూపేష్‌రెడ్డి ఆధ్వ ర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన తెదేపా కండువా వేసి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు. ప్రభాకర్, ఓబులేసు, చిన్న ఓబులేసు, ఇస్మాయిల్, ఏసోబు తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పాపిరెడ్డి, కొండయ్య, రాయల్ కిరణ్, ఆంజనేయులు, దస్తగిరి, రాజా, ఓబులేసు, మహేష్, బాల గంగరాజు, ముని రెడ్డి, గూడెం రవీంద్రారెడ్డి, నాగేష్, సుబ్బరాయుడు, శేషయ్య, పోల య్య, నాగన్న, స్వామి, దాసఎ, ఇసాక్, అర్జున్, గురువయ్య, బాల వెంకటేష్, రాజా రెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాజిక సాధికారిక బస్ యాత్ర సక్సెస్

రాయచోటి రూరల్, డిసెంబరు 28, ప్రభాతవార్త

తూర్పున నవకిరణాలు మెరిసినట్లు ఉక్కు పిడికిలి బిగించి గాండ్రించినట్లు సామాజిక గుండె చప్పుడు తప్పెట గూళ్లయి మార్మోగినట్టు గ్రామాలు, వీధులు ఒక్కటై బాటలన్నీ జనుప్పెనై రాయచోటి రణానినాదమై గర్జించింది. జయభేరి మోగించింది. బహుజన జెండాను రెపరెపలాడిస్తూ పెత్తందార్లపై సమర నినా దంతో కదం తొక్కింది. నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైఎస్ఆర్‌సీపీ బస్ యాత్రకు అడుగడుగునా నీరాజనాలు పలికింది. అభివృద్ధి సంక్షేమాన్ని జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్న నవ్యాంధ్ర నవరత్నను కీర్తించింది. జయహో జగన్ అంటూ గళమెత్తింది.